

# గోపీచంద్ గీతాపారాయణం

మూడు సంవత్సరాల పిల్లవాడు అడుగులు వేసుకుంటూ పరుగెత్తుకొని వస్తుంటే, ఎంత అందంగా వుంటుంది? వొచ్చీ రావటంతోనే తన చిట్టిచేతుల్తో వాటేసుకొని పెనవేసుకుంటే ఎంత బాగుంటుంది!

అందులో అతడు పిల్లల్నీ స్త్రీలనీ చూచి చాలారోజులైంది. జీవితం అంటే అసహ్యం పుట్టి, ఆ గదిలో వొక్కడే కూర్చుని గీతాపారాయణం చేసుకుంటూ కాలం గడుపుతున్నాడు.

ఆ పిల్లవాడెవ్వడో అతనికి తెలియదు. అతను గీత చదువుకుంటూవుంటే హఠాత్తుగా తలుపు నెట్టుకొని వచ్చి, వొచ్చీ రావటంతోనే ఈపని చేశాడు. మొదట్లో అతను పిల్లవాని చేతుల్లోనించి విడిపించుకుందామని అనుకున్నాడు. కాని ఆ బుల్లినోరు అతన్ని ఆకర్షించింది. పైగా అమ్మే—అమ్మ అన్నాడు.

గీతకి అందకుండా ఏ పొరలో దాక్కొనివుందో ప్రేమ, అతని కా పిల్లవాణ్ణిచూస్తే ప్రేమ కలిగింది. ఎత్తుకుందామని చేతులుజాపే తలికి ఆ పిల్లవాడు అతని కాళ్ళ సందున నక్కి "అమ్మే—అమ్మా" అన్నాడు.

ఇంతలో గడపలో అలికిడైంది. అతని హృదయం దడదడ కొట్టుకుంది. బల్లమీద తెరచివుంచిన భగవద్గీత కాగితాలు రెపరెప కొట్టుకున్నాయ్ కిటికీ తలుపు టపటప కొట్టుకుంది.

పద్దెనిమిది సంవత్సరాల అమ్మాయి. అతని గదిలో అడుగుపెట్టింది. అతన్ని చూసి, అడుగుతీసి, శరీరాన్ని తలుపు చాటుకు లాక్కుంది.

పిల్లవాడు అతని కాళ్ళుపట్టుకొని, పైకి ఎగబాకడానికి ప్రయత్నించాడు. అతడు వొక్కసారి బల్లమీద రెపరెప కొట్టుకునే భగవద్గీతను చూసుకొని అలాగే నిలబడిపోయాడు.

"రా బాబు వెళ్దాంరా!" అంది పిల్ల.

పిల్లవాడు అతని చొక్కాపట్టుకొని వేలాడాడు.

ఆ పిల్ల తలుపుచాటునుంచి తొంగి చూచి, "బిస్కట్లు పెడ్తారా... మా బాబుకదూ" అంది. అతనికి చొక్కా చిరిగి పోతుందేమోనని భయంవేసింది. "రావూ? నాన్నతో చెప్పనా?" అని అడిగింది, పిల్ల.

ఈ మాటలకు పిల్లవాడు భయపడి పోయాడు. బిత్తర చూపులు చూశాడు. అతనికాళ్ళు వొదలి, తల్లి దగ్గరకు పరి గెత్తాడు. ఆమె గదిలోకి ఎదురుగా వొచ్చి పిల్లవాణ్ణి ఎత్తుకొని తీసుకు వెళ్ళింది.

ఆమె బయటకు నడుస్తుంటే ఒక్కొక్క అడుగూ అతని హృదయాన్ని మీటింది. అడుగుతీసి అడుగుపెట్టేతలికి అతని ప్రాణం జివ్వున లాగింది. ఆమె భూమి మీద అడుగు పెట్టగానే అతనికి హాయిగా వుండేది. అడుగు తియ్యగానే నరాలు జివ్వున లాగేవి. ఆ ముడీ, ఆ మెడా, ఆ వీపూ, ఆ పిరుదులూ అతనికి దూర మవుతున్నకొద్దీ అతని హృదయానికి దగ్గరయినయ్.

నిట్టూర్చి అతడు భగవద్గీత ముం వేసుక్కూచున్నాడు. అయిదు సంవత్స రాల క్రితం ప్రేమించిన యువతి జ్ఞాపకానికి వొచ్చింది. తాను ప్రేమిం చటం — ఆ పిల్ల ప్రేమించటం, సిద్ధ పడటం—ఆ పిల్ల తల్లిదండ్రులు బలా త్కారంగా మరొకడికిచ్చి పెళ్ళి చెయ్యటం, తన హృదయం ముక్కల వడం—గీత సహాయంతో మళ్ళీ ముక్కలు అతుక్కోవటం అన్నీ జ్ఞాపక మొచ్చాయ్.

మర్నాడు అదే టైముకి మళ్ళీ ఆ పిల్ల వాడు ఒచ్చాదు అదే విధంగా పిల్లవాడి తల్లి కూడా వొచ్చింది. ఈసారి అతడు ధైర్యం చేశాడు— "పోనీ కొంచెంసేపు వుండనివ్వండి,ఆడుకుంటాడు" అన్నాడు.

ఆ పిల్ల —ఆ పిల్లవాని తల్లి — చిరునవ్వు నవ్వుతూ "వొట్టి కోణం గండీ, వున్నచోట ఉండడు" అంది.

అతను అనుమానిస్తూ పిల్లవాణ్ణి ఎత్తుకొని ముద్దుపెట్టుకున్నాడు. పిల్ల వాడు అతని మీసాలు పట్టుకుని లాగాడు. అతడు సిగ్గుతో చచ్చిపోతూ ఆమె వంకకు చూడలేకపోయాడు. ఆమె చిరునవ్వు నవ్వుతుంది. అతడు మీసం వొదిలించుకొని. 'కూర్చోండి' అన్నాడు.

"వొట్టి కోణంగి అండీ!"

"కూర్చోరూ?" — పిల్లవాడి తల నిమురుతూ అడిగాడు.

"వెళ్ళాలి" అంది. ఆమెకు నిజంగా

వెళ్లాలనేవుంది. కాని ఈసారి తన మెడా, వీపూ...అతనికి చూపడానికి సిగ్గువేసింది. కూర్చుంది.

ఇక మాటల్లేవు. పిల్లవాడు తల్లిదగ్గరకు పరుగెత్తాడు. అతన్ని చూపిస్తూ "తాత" అన్నాడు.

ఆమె వొయ్యారంగా "ఛీ" అని మందలించింది. అతనికి సిగ్గువేసింది "రా—రా" అని పిలిచాడు పిల్లవాణ్ణి.

"జాగర్త అండీ!"అంది పిల్ల అతనికి మీసాల సంగతి జ్ఞాపకంవచ్చి మళ్లీ సిగ్గువేసింది. ఆ పిల్ల చిరునవ్వు నవ్వుతూ లేచి 'వెళ్తాను' అని చెప్పి పిల్లవాణ్ణి ఎత్తుకొని సుతారంగా వీపుచూపకుండానే వెళ్లిపోయింది.

అప్పటి నుంచి ఆపిల్లవాడు రోజూ వచ్చేవాడు. ఒకరోజు 'భగవద్గీత' ముక్కలు ముక్కలుగా చించివేశాడు. రోజూ అతని మీసాలతో ఆడుకొనేవాడు. అతనికి కోపంవచ్చేదికాదు గాని బాధగా వుండేది. మీసాలు తీసివేద్దా మనుకున్నాడు. తీయించివేస్తే ఆ పిల్లవాడు దేంతో ఆడుకుంటాడు! రావటం మానివేస్తాడేమో ! అలాగే వుంచుకున్నాడు. కత్తిరించుకోవటం మానేసి చాలారోజులైంది.

ఒక రోజు పిల్లవాడు రాలేదు. సెలవలకు యింటికివస్తే కనబడనిభార్య కలిగిన విద్యార్థిలాగు అయిపోయాడు. ఆ పిల్ల యింటి ఎదురుగాఉన్న కిల్లీకొట్టు దగ్గరకు వెళ్లాడు. "ఆ ఇంట్లో ఎవరున్నారు?"అనిదుకాణదారుని ప్రశ్నించాడు.

"ఒక అమ్మాయి వుంది బాబూ" అని కొట్టువాడి జవాబు.

"భర్తలేడూ!" అని ప్రశ్న.

"ఎక్కడోవుంటాడు. రెండు మూడు నెలలకి వొకరోజువచ్చిపోతూంటాడు-" అని జవాబు.

"అన్యోన్యంగా వుంటారా?" అని ప్రశ్న.

"అయన్నీ మన కెట్లా తెలుస్తాయి, బాబూ! అయినా మొగుడూ పెళ్లాం అన్న తరవాత తన్నుకోకుండా వుంటారా? వచ్చినప్పుడల్లా వడ్డించిపోతుంటారు.'

అతనికి అకస్మాత్తుగా జాలివేసింది పిల్లవాణ్ణి యెత్తుకొని "ఊఁ, ఊఁ, ఊఁ" లాలించ బుద్ధిపుట్టింది—గబగబవెళ్ళి ఆ యింటి తలుపుకొట్టాడు. పిల్లే తలుపు తీసింది. అతని గుండెలు కొట్టుకున్నై. పిల్లకళ్లు ఎర్రబడివున్నై. జుట్టురేగి వుంది. పైగా అతన్ని చూచి బెదిరింది. భయపడింది.

"అబ్బాయి యేడీ?"అని అతని ప్రశ్న.

పిల్ల జవాబు చెప్పకముందే "తాత" అంటూ పిల్లవాడొచ్చాడు.

"తప్పు, తాత అనగూడదు" అని చెప్పుతూ పిల్లవాణ్ణి యెత్తుకొని ఆమె లోపలకు నడిచింది. అతను నెమ్మదిగా అనుసరించాడు.

"కూర్చోండి!"




అత డాపట్నే నుంచుని ఆమెని జాలిగా చూస్తున్నాడు. ఆ చూపులు ఆమె భరించలేకపోయింది. పిల్లవాడి జుట్టు నవరిస్తూ 'మా బాబే' అంది. పిల్లవాడు ఆమెభుజంమీదకు ఎక్కటానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆమె పమిట సర్దుకుంటూ "కూర్చోరూ," అంది. అతడు ఎక్కడో కూర్చోబోయాడు.

''కుర్చీలో."

కూర్చున్న అతని వొళ్లోకి వెళ్లాలని పిల్లవాడిమారాం ఆ పిల్ల కుర్చీదగ్గరకు వచ్చి అతనికి పిల్లవాణ్ణి అందించటానికి వంగింది. స్తనభారంతో అనుకున్నదాని కంటె దగ్గరకు వంగింది. అతని చూపులుపడ్డయి. చిలిపిపిల్లాడు-మీసాలు పట్టుకులాగాడు. ఇద్దరూ నవ్వుకున్నారు. అతడు పిల్లవాణ్ణి వొళ్లోకి తీసుకొని- "రావటంలేదేం, బాబూ?" అని బుజ్జగిస్తూ అడిగాడు.

''నాన్నొద్దన్నాలు''

''తప్పు, ఏం మాటలవి," అని తల్లి మందలించింది. కాని పిల్లాడు ఆగలేదు. చెప్పేశాడు— "నాన్నొద్దాలు, అమ్మని కొత్తాలు."

అతను జాలిగా పిల్లని చూశాడు. ఆమె చేత్తో మొహం కప్పుకొని కన్నీరు కారుస్తూ వుంది.

''క్షమించండి'' అన్నాడు.

"మీ తప్పేముంది నాకర్మ."

అతడు అక్కడ వుండలేక పోయాడు.

తలుపు తీసుకొని వెళ్ళిపోయాడు.

పిల్లవాడు "తాతా" తాతా అని పిలుస్తూనే వున్నాడు. తల్లి వాణ్ణి హృదయానికి హత్తుకుంటూ ముద్దుపెట్టుకుంటూ ఏడ్చింది.

ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు. తాను అయిదు సంవత్సరాల క్రితం ప్రేమించిన పిల్ల ఇప్పుడు ఏంచేస్తుం

ఋంది? భర్తతో కాపరమేగా? కోపం వచ్చింది. తా నిలాచస్తుందే! చేతిలో వున్న భగవద్గీత నేలకు విసరికొట్టాడు.

ఎవ్వరో తలుపు కొట్టారు. నెమ్మ దిగా వెళ్ళి తలుపు తీశాడు. ఆ పిల్ల వచ్చింది. అతన్ని చూచి బోరునవేడ్చింది. అతనికేమీ తోచలేదు — "నే కాపరం చెయ్యలేను. పిల్లవాడికోసం ఇన్నాళ్ళూ వోర్చుకున్నాను. ఇక సహించలేను" అని ఏడ్చింది అతని హృదయం కరిగి నీరయింది ఆమె పెదవి వొణికిపోతుంటే అతడు గిజగిజలాడాడు ఆమెని ఓదా ర్చాడు ఆమె ఏడ్పు మరీ ఎక్కువ యింది. "సహించాలి- మనస్త్రీలు అందుకు ప్రసిద్ధి. కష్టాలు కాపురం వుండవు" అని ఓదార్చాడు.

"నేనేం చేశాను? అయననన్నెందుకిలా హింసించాలి!" అని అతని వక్షంమీద తలఆన్చి యేడ్చింది. అతనికూ్కడా కళ్ళవెంట నీళ్లుకారినై. ఆమెను దగ్గరకు తీసుకొని "ఏడవకు నామాట వినవ్!" అని గడ్డం పట్టుకుని మొహం పైకెత్తి అడిగాడు. ఆమె శోకాన్ని దిగమింగ టానికి ప్రయత్నించింది. కాని ఆపుకో లేకపోయింది. మళ్ళీ అతని వక్షంమీద తలఆన్చి ఏడ్చింది. అతిని చొక్కా కొంతవరకు తడిసింది

"ఇదిగో కొంచెం విశ్రాంతి తీసుకో." అని నెమ్మదిగా పక్కమీద కూర్చో బెట్టాడు. ఆమె పడుకుని దిండులోకి తలదూర్చి యేడ్చింది— "నేని సహించ లేను. పిల్లాడు పిల్లాడు."

అతడు నెమ్మదిగా పక్కనకూర్చొని ముగురులుసవరిస్తూఓదార్చాడు బాధతో, యేడ్పుతో, ఆమె శరీరం వేడెక్కింది అతడు తలకింద చెయ్యిదూర్చి కన్నీరు తుడిచాడు. ఆమె కన్నీరు ఆగలేదు. అతని చెయ్యి నొప్పిపుడుతూవుంది. నెమ్మదిగా చెయ్యి తీసుకొనేటప్పటికి "పిల్లాడు పిల్లాడు" అని ఆ పిల్ల యేడ్చింది. అతని నడుం నొప్పిపెట్టింది పక్కనే పడుకున్నాడు. "పిల్లాడు— పిల్లాడు"అని యేడుస్తూ ఆమె కావలించు కుంది. అతడు ముద్దుపెట్టుకొన్నాడు. ఆమె కన్నీళ్లు అతని పెదవుల్ని కాల్చినై. ఆమె శరీరం అతని శరీరానికి దూది పింజలా తగిలింది. వేడ నిట్టూర్పులు అతన్ని వుద్రేకపరిచాయి. ఆమె కళ్ళని ముద్దుపెట్టుకొన్నాడు, పెదమల్ని ముద్దు పెట్టుకొన్నాడు. మెడని ముద్దుపెట్టు కొన్నాడు

''పిల్లాడు—పిల్లాడు'' అని యేడుస్తూ అతన్ని గట్టిగా కావలించు కుంది. ఆమె స్థనాలు అతని చేతికి తగి లినై. అంతకుముందు అవి అంతపెద్దవి అనిగానీ, ఆమె లోపలిబాడీ వేసుకోలేదని గానీ అతనికి తెలియదు.

"పిల్లాడు-పిల్లాడు" అని యేడుస్తూ ఆమె అతని చేతిని కదలనివ్వకుండా తన చేత్తో అదుముకుంది.

అతని తల గిర్రున తిరిగింది. ఇంటి కప్పు కనబడటం లేదు. ఏ మోతా విన పట్టంలేదు. మంచంవేడి యెక్కువైంది. ఏదో లోకంలోకి ఒరిగిపోతున్నట్లు అని పించింది.

నెమ్మదిగా లేచి తలుపు గడియ వేసి వచ్చి పడుకున్నాడు.

"పిల్లాడే!"

"నేనున్నానుగా?"

తెల్లవారిలేచి చూచేటప్పటికి ఆ పిల్ల వెళ్ళిపోయింది. నలిగిపోయిన పక్క కనిపించేటప్పటికి కలవరం పుట్టింది. ఇంతకు పూర్వం తాను ప్రేమించిన స్త్రీ మొహాన తుపుక్కున ఉమ్మేసినట్లు బాధపడ్డాడు. మంచం పక్కనే ఉన్న భగవద్గీత వెక్కిరించింది. బర్రునవెళ్ళి తలుపుతీసి ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు. మర్నాడే మకాం యెత్తి వేశాడు మళ్ళీ గీతాపారాయణం మొదలుపెట్టాడు. ఆ యింటి ఛాయలకు వెళ్ళలేదు. గీతా మహత్యం-ఆత్మని లోబరుచుకున్నాడు. ఒకనాడు అతను తన గదిలోవుండి గీతాపారాయణంచేస్తూ కిటికీలోంచి బయటకు చూట్టం తటస్థించింది. దూరాన్నుంచి ఒక స్త్రీ వస్తూంది. అతని వొళ్ళు ఝల్లుమంది. అయిదు సంవత్సరాల క్రింద తాను ప్రేమించిన స్త్రీ ఆ ఇసుకలో కాళ్ళీడ్చుకుంటూ వొస్తూవుంది. పెట్టెబు ఎక్కువైన గూడ్సుబండిలా వొస్తూవుంది.

అతనికేమీ తోచలేదు. ఊ! అయిదు సంవత్సరాల క్రితం తాను ప్రేమించిన స్త్రీ యిప్పుడిక్కడకు యెందుకు వొస్తూ వుంది? రెండోపిల్ల జ్ఞాపకం వచ్చింది. భగవద్గీత చేతిలోనుంచి జారిపడింది.

ఇక తనేం కావాలి? అయిదు సంవ

త్సరాల క్రితం ప్రేమించిన ఈ అమ్మాయిని మరచిపోటానికి ఎంత ప్రయత్నించాడు! అది అట్లా వుండగానే రెండో అమ్మాయి తన జీవితంలోకి ఎట్లా ప్రవేశించింది? మళ్ళీ ఇప్పుడీ మొదటి అమ్మాయి ఎందుకు వొస్తూవుంది? ఇక తన జీవితం ఏంకావాలి!

మొదటి అమ్మాయి, యిసుకలో కాళ్ళీడ్చుకుంటూ వొస్తూన్న అమ్మాయి గది ప్రవేశించింది. ఆమెను చూచేటప్పటికి అతని హృదయం బ్రద్దలైంది ఇదేమి అవతారం! బుగ్గలు పీక్కుపోయినై. కళ్లు గుంటలుపడ్డయ్; డొక్కయిపోయింది.

ఆమె అతని మనస్సులోని భావాలు గ్రహించి భోరున ఏడ్చింది. అతడు ఆమెని అలాగే ఏడవనిచ్చాడు. ఓదార్చటానికి ప్రయత్నించలేదు.

"నేను చాలా ప్రయత్నించాను. నా ఆత్మని చంపుకొని శరీరాన్ని ఆయనకి అప్పగించాను. లాభంలేకపోయింది. ఆయన్తో నేనిక కాపరం చెయ్యలేను. ఇక్కడే వుండిపోతాను. మీ దగ్గర వుండనివ్వండి. మీ పాదాలవద్ద పడి వుంటాను" అని ప్రార్థించింది.

"నేకేమన్నా పిచ్చా!" అన్నాడు.

"పిచ్చే! నేనెంత బాధపడ్డానో, మీకేం తెలుసు? మొదటిలో ఆయన్ని మిమ్మల్నిగానే వూహించుకుని తృప్తి పడ్డాను. ఆయన్తో మాట్లాడుతుంటే మీతో మాట్లాడుతున్నట్టే వుండేది. ఆయన పక్కనవుంటే మీతో వున్నట్టే వుండేది. కానియిప్పుడు...ఇప్పుడు...నాటకంలో తృప్తిపోయింది. నేనిక ఇక్కడే వుంటాను."

"ఏం మాటలు? ఎవరన్నావింటే-చూస్తే!" అన్నాడతడు.

"నాకేం! వీళ్ళని నేనెందుకు లెక్క చెయ్యాలి? ఈ సంఘం నన్ను ఉద్ధరించిందా? నేనిక్కడే వుండిపోతాను. ఆ నరకానికి పంపరుకదూ?" అని పాదాలు పట్టుకొని ఏడ్చింది.

అతడు వెనక్కి జరిగి చెప్పాడు—"అతడు నీ భర్త, నువ్వు ఆయన్తోనే వుండాలి. ఈ తనువులు శాశ్వతంకాదు. ఇవ్వాళ ఇక్కడున్నాం. రేపు యేమవుతామో చెప్పలేం!" అన్నాడు. ఈ ధోరణిలో గంటసేపు ఉపన్యాసం యిచ్చాడు. ఎన్నెన్నో చెప్పాడు.

అతని మాటలకు ఆమెకు కోపము వచ్చింది. లేచి నిలబడింది. తీక్షణంగా అతని కనులలోకి చూచింది. "ఈ తనువులు శాశ్వతంకాదూ?" అన్నది

"అవును."

"ఏది శాశ్వతం?"

"ఏదీ కాదు."

"ఏదీ శాశ్వతంకాదు. త్వరపడాలి, త్వరపడాలి" అనుకుంటూ తలుపు దగ్గరకువెళ్ళి వెనక్కుతిరిగి, "మీ ఉపదేశాన్ని మరచిపోను. తనువులుశాశ్వతం కాదు. త్వరపడాలి'' అని చెప్పి రివ్వున వెళ్ళిపోయింది. అతనికి ఆశ్చర్యం వేసింది. తనహితోపదేశం యింత త్వరలో పనిచేసినందుకు సంతోషించాడు. ఆ రాత్రి హాయిగా నిద్రపోయాడు. ఒక కుటుంబాన్ని నిల

బెట్టానని గర్వపడ్డాడు. తెల్లవారి ఒక స్నేహితుడు కనిపించి యిలా అన్నాడు:

"విన్నావా?''

"ఏమిటి?"

"నువ్వు చాలా అదృష్టవంతుడివి. నువ్వు ఐదు సంవత్సరాల క్రితం ప్రేమించిన పిల్ల వంటవానితో లేచిపోయింది."

"శ్రీహరీ!"

అతనికి మండిపోయింది. తన ఉపదేశమంతా వ్యర్థమయింది. ఇంకా నయం తానే పెళ్ళి చేసుకోలేదు. ఆమె వెళ్ళబోయేముందు తమ మాటలు అప్పుడతనకి జ్ఞాపకం వచ్చినై. "తనువులు శాశ్వతంకాదు. తర్వపడాలి''

''అవును"

"ఏది శాశ్వతం?''

''ఏదీ కాదు"

"అయితే త్వరపడాలి"

అతని శరీరం వేగంతో వొణికిపోయింది. ముచ్చెమటలు పోసినై. ఆమె లేచిపోవటానికి తానే కారణమా? తన గీతోపదేశమే కారణమా? ఆమె కసలు ఉపదేశం చెయ్యడానికి తనకేమి హక్కు వుంది? తన్ను ప్రేమించి తన దగ్గరకు వస్తే, సంఘానికి జడిసి, తిరస్కరించి, పైగా గీతోపదేశమా? ఇంతకీ ఆమె యేమి బాగుపడింది? తను తిరస్కరించబట్టేగా వంటవాడితో లేచిపోయింది. వేదాంతబోధ చెయ్యకుండా తనే అంగీకరిస్తే! అతని హృదయం ఆవేశంతో తికమకలాడింది. "దీనికి నేనే కారణం, దీనికి నేనే కారణం" అనుకుంటూ కూర్చున్నాడు. హఠాత్తుగా అతనికి రెండోపిల్ల జ్ఞాపకమొచ్చింది. ఆమె భర్త చేతుల్లో యెంత బాధపడి తన దగ్గరకు వొచ్చిందో అర్థమైంది. హృదయం ఆమెకోసం ఆక్రోశించింది.

వెంటనే తలుపు గభాలున తెరచుకొని ఆమె యింటికి పరుగెత్తాడు. తలుపులు నెట్టుకుని లోపలికి ప్రవేశించాడు. ఆమె పడుకొని నిద్రపోతూ వుంది. పిల్లవాడు పక్కనేపడి ఏడుస్తున్నాడు. ఆమెని చూసేటప్పటికి నిద్రిస్తున్న అతని శక్తులన్నీ ఒక్కసారి రేగాయి. శరీరం జాలితో, ప్రేమతో, ఉద్రేకంతో ఉడికిపోయింది. గప్పున మంచం దగ్గరకు ఉరికాడు కోర్కెలతో ఉప్పొంగిపోతున్న హృదయంతో ముద్దుపెట్టుకోటానికి మంచం మీదికి వంగాడు. మంచంమీద అజాగత్రగా విస్తరించి పడుకున్న పిల్లడు అటొకకాలూ ఇటొకకాలూ వేసి చేతులు వేలాడవేసి పడుకున్న పిల్లని, తియ్యని కలల బరువుతో వాలిన రెప్పలుగలిగిన పిల్లని నిద్దరలో పమిట తొలగిన పిల్లని, అస్తారబతంగానో, అమాంతంగానో చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకొని కావలించుకుంటే ఎంత బాగుంటుంది? కానీ—

అతని హృదయం టప్న ఆగిపోయింది. వంగినవాడు వంగినట్లుగానే కొయ్యబారిపోయాడు. ఆమె మంచం మీద అలాగే పడుకొనివుంది—చలనము లేదు. ఆమె ఆత్మహత్య చేసుకుంది.

"తాతా—తాతా'' అని పిల్లవాడు యేడుస్తున్నాడు. అతనికి 'గీతా, గీతా' అన్నట్లు వినబడింది.

———